

శ్రీ సాయినాథ
స్తవనమంజరీ
అనువాదం
కె.ఎస్. గీతారాణి
మరాఠీ మూలం
దాసగణుమహరాజ్

# అన్నదాన సేవా పథకము

శ్రీసాయిబాబా అన్ని దానములకంటే 'అన్నదానాని'కి ప్రాముఖ్యతను ఇచ్చారు. ఆకలైన ప్రతిజీవికి అన్నదానం పొందే అర్హత యున్నదని సాయి చెప్పారు. సాయిమార్గంలో పయనించే మనం మన శక్తికి మించకుండా అన్నదానాన్ని ప్రోత్సహించటం మనకు లభ్యమైన అవకాశము.

అన్నదానం మరియు ప్రసాద వితరణ కార్యక్రమములకు రూ.111/- లేదా ఆ పైన ఎంతమొత్తమైనా డి.డి.ద్వారా ఈ దిగువ చిరునామాకు పంపండి.

**SRI SAI DARSHAN CHARITABLE TRUST**
**Dammaiguda, Hyderabad - 500 083,**
**Ph : 040-27120081, 65640220 Cell : 9866748099**

# శ్రీ దాసగణూకృత శ్రీ సాయినాథ స్తవనమంజరి



సాయిబంధువులు ఈ స్తవనమంజరి గ్రంథాన్ని 11 కాపీలు లేక ఎక్కువ ఆర్డరుచేసి సాయిమందిరములలోను, వివాహశుభకార్యములలోను, సత్సంగములోను పంచండి.

*Published by* SRI SAI DARSHAN
Dammaiguda,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com

*DTP* SREE SAI RAM GRAPHICS
Ramnagar, Hyderabad - 20.
Tel : 27611973



## ముందుమాట

ఒంటరిగా, కొద్దిమందిలో చేరి ఇష్ట దైవాన్ని శ్లోకరూపంగా బిగ్గరగా స్తుతి చేయటమే స్తోత్రం. ఉపాసనీ మహారాజు రచించిన శ్రీసాయినాథ మహిమ్నస్తోత్రం, శ్రీ కృష్ణ జగేశ్వర్ భీష్మగారి శ్రీసాయినాథ ప్రభాతాష్టకము,దాసగణు శ్రీసాయినాథ స్తవన మంజరి మరాఠీభాషలోనే, తెలుగువారికి నిత్య పఠనీయాలయ్యాయి. నిత్యం విన్నూత్నంగా భాసించే ఆ రత్నమాలికలను సాయి ప్రేరణలేకుండా వ్రాయటం మానవులకే కాదు ఆది మానవులకు కూడా సాధ్యమా?

గణపతిరావు దత్తాత్రేయ సహస్రబుద్ధె కేవలం నానాసాహెబ్ చందోర్కర్ అను ఒక అధికారిని సంతోషపరచేందుకు షిరిడీలో సాయిబాబాను దర్శించాడు. మట్టిని మణిగా మార్చాడుసాయి. ఎన్నో ఉదాహరణలున్నాయి. అందులో ఒకటి దాసగణు జీవితం. వీధిబడిలో చదివి, లల్లాయి పదాలు వ్రాసే పోలీసు దాసగణులో నిలువెల్ల మార్పుతెచ్చారు సాయి. దాసగణుకు సంతానం లేదు. ఆయన సంతానాన్ని ప్రసాదించమని సాయిని కోరలేదు. పైగా తన భార్యకు పిచ్చి, పిచ్చికుదర్చమని సాయిని

కోరలేదు. తన గురువు ద్వారా సంక్రమించే ఆస్తిని కూడ దాసగణు స్వీకరించలేదు. చివరకు హరికథలు చెప్పేటడప్పుడు ఆరతి పళ్లెంలో కాసులు వేయవద్దనేవాడు గణూ. షిరిడి వెళ్ళి ప్రత్యక్ష దైవం సాయిని దర్శించండి అనేవాడు. ఆయన అనేక రచనలు చేశాడు. పూనా విశ్వవిద్యాలయం ఆయన రచనలను పాఠ్యగ్రంథాలుగా ఆమోదించింది. అంతేకాదు గణు శ్రీసాయిస్తవన మంజరి రచన నర్మది నదీ తీరాన మహేశ్వరక్షేత్రంలో 1918 వినాయక చవితినాటికి పూర్తిచేసి, షిరిడీకి వచ్చి 12.09.1918 సప్తమి గురువారంనాడు దానిని గానం చేస్తు తన పితలుదైన సాయిబాబాకు అంకితం ఇచ్చాడు.

అదేసమయంలో సగుణమేరు నాయక్ అనే భక్తుడు ఉండటం జరిగింది. శ్రీసాయి ప్రభువు తన్మయత్వంతో, చిరునవ్వుతో ఆ స్తోత్రపఠాన్ని ఆలకించారని, అది సాయి భక్తులందరకు నిత్య పారాయణ గ్రంథం కాగలదని, దీనిని నిత్యం పారాయణ చేసేవారి సర్వారిష్టాలు తొలగుతాయని సాయి పలికారని, 1960లో సగుణ మేరునాయక్ పేదూరి శర్మగారితో చెప్పటం జరిగింది.

చింతామణి కామధేనువు, కల్పతరువుల మహత్తుకు పరిమితులున్నాయి. శ్రీసాయినాథస్తవన మంజరికి లేవు. మహామహిమాన్వితమైనది ఆ స్తవనము.



శ్రీసాయినాథ స్తవనమంజరి అమృత వాహినిని ప్రవహింపచేస్తున్నా, మరాఠీలో వుండటం వలన, తెలుగు భక్తులు రసాస్వాదనను చేయలేకపోతున్నారు. ఆలోటును పూరించడానికి షిరిడీసాయిబాబా సంస్థానము షిరిడీవారు ప్రచురించిన శ్రీసాయినాథస్తవన మంజరిని మరాఠీ నుండి తెలుగులోనికి అనువదించటం జరిగింది.

అమూల్యమైన ఆ అమృత రచనను శ్రీసాయిదర్శన్ రావూజీగారు కనీసం లక్షమంది సాయిభక్తులచే పఠింపచేయాలనే సత్సంకల్పం హర్షదాయకమే.

ఆ అమృత కళశం నుండి నిత్య పఠన ద్వారా జాలువారే అమృతబిందువులకు హక్కుదారులు మనమే !

29-6-2006

మణి

కిషన్‌బాగ్,

హైద్రాబాదు - 500 264

# తెలుగువారికి గురుపూర్ణిమ కానుక

తెలుగువారికి సాయిబాబా ఆరాధ్యదైవమే కాదు - ఈనాడు ఇలవేలుపు కూడా.

అందుచేతనే గల్లీగల్లీలో శ్రీసాయి మందిరాలు నిర్మింపబడుతున్నాయి. గంటగంటకు నిత్యపారాయణ గ్రంథాలు వెలువడుతున్నాయి. ఇంతవరకు సాయినాథుని గూర్చిన మూల గ్రంథాలు మరాఠీలోనే వున్నాయి. తెలుగువారికి ఆ భాష రాదు. ఆ గ్రంథాలలోని భావాలు తెలియవు. అందుచేత కొన్ని రచనలు మరాఠీ నుండి తెలుగులోనికి తర్జుమా కావడం మొదలయ్యాయి.

మణిగారు శ్రీసాయిబాబా సంస్థాన్ షిరిడీవారు ప్రచురించిన శ్రీసాయి నాథస్తవనమంజరిని తెలుగులోనికి తర్జుమా చేయటం జరిగింది. మణిగారి రచన గోదావరి ప్రవాహంలాగా ధారాళంగా సాగిపోయింది. అందరి నోట పలికే తేటతెలుగులో ఆమె వ్రాయటం, శ్రీసాయిదర్శన్ వారికి ప్రచురించే అవకాశం యివ్వటం ఆనందకరమైన విషయం.



ఈ స్తవనమంజరిని కనీసం లక్షమంది తెలుగు భక్తులకు అందచేయాలనే శ్రీసాయిదర్శన్ తపనను సాయి భక్తులు గ్రహించి, స్పందిస్తున్నారు.

తొలివిడతగా **2006** గురుపూర్ణిమ నాటికి వీలయినంత మంది సాయి భక్తులచే, ఈ స్తవనమంజరిని పఠింపచేయాలనే మా ఆకాంక్ష నెరవేరేటట్లు ఏర్పాట్లు చేసిన ఆ సాయినాథునికి పాదాభివందనములు సమర్పిస్తున్నాము.

ప్రతి తెలుగువారి నోట శ్రీసాయిస్తవనమంజరి నిత్యపఠనీయం కావాలని సాయి కృపామృతానికి హక్కుదారులు కావాలని, ఈ కృషిలో ప్రతి సాయి భక్తుని సహాయసహకారాన్ని ఆశిస్తూ

హైద్రాబాద్ మీ

**30-6-2006** రావూజీ

హరిభక్తపరాయణ

## శ్రీదాసగణూకృత

# శ్రీసాయినాథ స్తవనమంజరి

శ్రీగణేశాయనమః ఓ సర్వాధారా ! మయూరేశ్వరా ! సర్వసాక్షి గౌరీకుమారా! ఓ అచింత్యా! లంబోదరా! శ్రీ గణపతీ పాహిమాం.1. నీవు సకల గణాలకు అది ఈశ్వరుడవు. అందుకే నిన్ను గణేశుడని అంటారు. సకల శాస్త్రాలు నిన్ను అంగీకరిస్తున్నాయి. మంగళరూపా! ఫాలచంద్రా!.2.

శారదా! వాగ్విలాసినీ! నీవు పద్యాలను సృష్టించిన వాగీశ్వరివి. నీ అస్తిత్వం వలననే జగత్తులోని వ్యవహారాలు నడుస్తున్నాయి. 3. నీవు గ్రంథకర్తల దేవతవు. నీవు దేశానికి ఎల్లప్పుడూ భూషణానివి. అన్నిటియందూ నీ శక్తి అగాథం జగదంబా! నీకు నమస్కారం. 4.



ఓ పూర్ణబ్రహ్మా! సాధుసజ్జనప్రియా ! ఓ సగుణరూపా ! పండరీనాథా ! కృపాసాగరా, పరమదయామయా ! పాండురంగా! నరహరీ ! 5. నీవు అందరినీ నడిపించే సూత్రధారివి. నీవు జగమంతటా వ్యాపించిఉన్నావు. సకలశాస్త్రాలు నీ స్వరూపాన్ని పరిశోధిస్తున్నాయి. 6. ఓ చక్రపాణీ ! నీవు పుస్తకజ్ఞానులకు అంతుపట్టవు. ఆ మూర్ఖులందరూ వాద వివాదాలు చేసేవారు. 7. సాధువులు మాత్రమే నిన్ను తెలుసుకోగలరు. మిగతావారు మౌనంగా ఉంటారు. నీకు సాదరంగా నా సాష్టాంగనమస్కారం. 8.

ఓ పంచవక్త్రా శంకరా! కపాలమాలాధారీ! ఓ నీలకంఠా! దిగంబరా! ఓంకారరూపా! పశుపతీ! 9. నీ నామాన్ని స్మరించిన వారి దైన్యం వెంటనే తొలగిపోతుంది. ధూర్జటీ ! నీ నామం యొక్క మహిమ ఇటువంటిది. 10. నీ చరణాలకు వందనం చేసి నేను ఈ స్తోత్రాన్ని రచిస్తాను. నీలకంఠా ! దీనిని సంపూర్ణం చేసేలా సహకరించు ! 11.

ఇప్పుడు అత్రిసుతునకు, ఇందిరాకులదేవతకు, తుకారామాది సత్పురుషులకు మరియు భక్తులందరికి నమస్కారం. 12.

జయ జయ సాయినాథా, పతిత పావనా! పరమదయాళా! మీ చరణాలయందు శిరస్సు నుంచుతున్నాను. ఇక అభయాన్ని అనుగ్రహించండి. 13. మీరు సుఖానికి నిలయమైన పూర్ణ బ్రహ్మ. పురుషోత్తముడైన విష్ణుమూర్తి మీరే. ఉమ ఎవరికి అర్ధాంగియో ఆ మదనాంతకుడు కూడా మీరే. 14. మీరు మానవశరీరాన్ని ధరించిన పరమేశ్వరులు. మీరు జ్ఞానాకాశంలోని భాస్కరులు, దయాసాగరులు, మీరు భవరోగానికి ఔషధం. 15. మీరు హీనులకు, దీనులకు చింతామణి. భక్తులకు పవిత్రగంగాజలం. మీరు ప్రపంచములో మునిగిపోయే వారిని తరింపజేసే నౌక. భయభీతులకు ఆశ్రయం. 16. మీరు జగత్తుకు ఆది కారణం. దయాఘనా ! నిర్మలచైతన్యమైన ఈ సృష్టి విలాసమంతా మీదే. 17.మీరు జన్మరహితులు మీకు మృత్యువు లేదు. బాగా పరిశోధిస్తే చివరకు ఇదే అవగతమౌతుంది. 18. జననమరణాలు రెండూ అజ్ఞానం వలన కలుగుతాయి. మహారాజా! మీరు రెంటికీ అలిప్తంగా ఉంటారు. 19.



నీరు ఒక చోట ఊటలా ప్రకటమైంది. అయితే అది అక్కడే పుట్టి పైకి వచ్చిందా? అది ఆదినుండి అక్కడ పూర్ణంగా నిండిఉండి లోపలినుండి వచ్చింది. అంతే. 20. ఒక లోతు గుంతలో నీరు ఊరితే దానికి బావి అని పేరు కలుగుతుంది. నీరు లేకపోతే అది ఒక గుంత మాత్రమే. 21. నీరు గుంతలో ఊరటం, లేదా ఎండిపోవటం ఇది నీటికి అసలు పట్టదు. నీరు గుంతకు అసలు ఏ విలువా ఇవ్వదు. 22. అయినా నీరు నిండుగా ఉన్నప్పుడు గుంతకు మాత్రం గర్వం. అందువలన నీరు బాగా ఇంకిపోగానే దైన్యావస్థను పొందుతుంది. 23. ఈ మానవశరీరం నిజంగా గుంత వంటిది. ఇందులోని శుద్ధచైతన్యం నిర్మలమైన నీరు. గుంతలు అసంఖ్యాకంగా ఉన్నా నీరు అన్నింటిలో ఒకటే. 24.

దయామయా ! జననమరణాలకు అతీతమైన మీరు, అజ్ఞానమనే పర్వతాన్ని ఛేధించడానికి వజ్రాయుధం కావాలి. 25. భూమిపై నేటి వరకు అనేక గుండాలు వెలి[illegible] ఉన్నాయి. ఇక ముందు ఉంటాయి. 26. అయా ప్రత్యేక గుండానికి విశేషమైన రూపం పేర్లు ఉంటాయి. వాని ద్వారానే వానిని గుర్తించగలం. 27. అయితే

చైతన్యాన్ని నీవు నేను అని అనటం ఉచితం కాదు. ఎందుకంటే చైతన్యంలో ద్వైతం లేదు కనుక. 28. పైగా చైతన్యం జగమంతటా వ్యాపించి ఉంటుంది. అటువంటప్పుడు నీవు నేను అను భావన అక్కడ ఎలా సంభవం? 29.

మేఘాలలోని నీరు అంతటా ఒకేలా ఉంటుంది. భూమి పై పడగానే ఆ నీటికి అనేక భేదాలు కలుగుతాయి. 30. గోదావరిలో పడిన నీటిని గోదావరి అని అంటారు. అయితే బావిలో పడిన నీటికి నదీ జలానికి ఉన్న పవిత్రత లేదు. 31. గోదావరి సత్పురుషులవలె పవిత్రం. మీరు అందులోని నీరు. మేము అక్కడక్కడా ఉన్న వాపీకూపతాటాకాలము. అదే మీకు మాకు భేదం. 32. మేము కృతార్థులవటానికి చేతులు జోడించుకుని ఎల్లప్పుడూ మీ వద్దకు శరణాగతులై రావాలి కారణం మీరు పవిత్రులు. 33. గోదావరి జలానికి పాత్రతను బట్టి పవిత్రత వచ్చింది. వేరే ఎక్కడి నీరైనా ఒక్కటే. 34. గోదావరి జలాలు ప్రవహించే ఆ భూస్థలం పవిత్రమని నిర్ణయించబడింది. ఎందుకంటే అక్కడి భూమి యొక్క గుణాలను బట్టి ఇది నిర్ణయించబడింది. 35. మేఘగర్భంలోని నీటిని ఏ ప్రదేశం ఏ మార్పు చేయదో అదే



భూభాగాన్ని గోదావరి అని శాస్త్రవేత్తలన్నారు. 36. ఇతర ప్రదేశాలలో పడిన నీరు ఆయా స్థలాల గుణాలను గ్రహిస్తాయి. మొదట్లో మధురంగా ఉన్న నీరు, ఆయా ప్రదేశాలలోని ప్రభావం వలన అనారోగ్యంగా, ఉప్పగా, వగరుగా మారుతుంది. 37. అట్లే గురువరా మీ పట్ల కూడా ! కామక్రోధాది అరిషడ్ వికారాల మాలిన్యాలు లేని పవిత్ర శరీరానికి సత్పురుషులనే నామం శోభిస్తుంది. 38. అందువలన సత్పురుషులు గోదావరి అని నేను అంటాను. సకల జీవులలోను మీ యోగ్యతే శ్రేష్ఠమైనది. 39. జగత్తు ఆరంభమైనప్పటి నుండి గోదావరి ఉంది. నీరు కూడా ఏ లోటు లేకుండా ఈనాటి వరకూ పరిపూర్ణంగా నిండుగా ఉన్నది. 40. శ్రీరాముడు గోదావరి తీరానికి వచ్చినప్పుడు ఆ కాలంలో నదిలో ఉన్న నీరు ఇప్పటివరకూ ఉంటుందా! 41. నీరు ఉన్నస్థలం మాత్రం ఇక్కడ మిగిలిఉంది. నీరు సాగరంలో కలిసిపోతుంది. అయినా నీరు ఉన్న స్థలం యొక్క పవిత్రత నేటి వరకూ స్థిరంగా ఉంది. 42. ప్రతి సంవత్సరమూ పాతనీరు పోయి క్రొత్తనీరు వస్తూనే ఉంటుంది. మీ పట్ల కూడా ఇదే న్యాయం వర్తిస్తుంది. 43. ఒక శతాబ్దంలోనిదే సంవత్సరము. ఆ శతాబ్దంలోని సత్పురుషులు నీటి ప్రవాహం

వంటివారు. సాధువులు ఆ నీటిపైని అలల వంటివారు. 44. ఈ పవిత్ర గోదావరి వద్దకు ప్రథమ శతాబ్దంలో సనత్ సనకసనందనాదులు ప్రవాహంలా వచ్చారు. 45. తరువాత నారద తుంబుర ధృవ ప్రహ్లాద బలి మొదలగు రాజులు; శబరి, అంగదుడు, హనుమంతుడు, విదురుడు, గోపగోపికలు వచ్చారు. 46. ఇలా ఈనాటి వరకూ ప్రతి శతాబ్దంలోనూ పుష్కలంగా వచ్చారు. వారిని వర్ణించదానికి నేను అశక్తుణ్ణి. 47. ప్రస్తుతం ఈ శతాబ్దంలో పవిత్ర గోదావరి సమీపాన నిశ్చయంగా సాయినాథులైన మీరు వచ్చారు. 48.

అందువలన మీ దివ్యచరణాలకు నేను వందనం చేస్తాను. ప్రభూ ! నా దుర్గుణాలను పరిగణించకందని వేదుకుంటున్నాను. 49. నేను హీనుణ్ణి, దీనుణ్ణి, అజ్ఞానుణ్ణి, పాతకశిఖామణిని, ఇలా సకల చెడు లక్షణాలు కలవాణ్ణి. అయినా దేవా ! నన్ను ఉపేక్షించకండి. 50. పరుశువేది ఇనుములోని దోషాలను పట్టించుకోదు. గోదావరి ఊరిలోని కాలువలను బహిష్కరించదు. 51. బాబా మీ కృపాకటాక్షాలతో నాలోని సకల కల్మషాలను త్వరగా తొలగించండి. ఇదే ఈ దాసుని విన్నపం. 52. పరశువేది



సాంగత్యంలో ఇనుము బంగారం కాకపోతే ఆ లోపం పరశువేదిది. 53. మీరు పరశువేది, నేను ఇనుమును. నాలో పరివర్తన రాకపోతే ఆ లోపం మీ పైన ఆపాదించబదకూడదు. మీకు అప్రతిష్ఠ రాకూడదు. కనుక నన్ను పాపిగా ఉంచకండి. 54. పిల్లలు ఎల్లప్పుడూ తప్పులు చేస్తూంటారు. కాని తల్లి కోపగించుకోదు. దీనిని దృష్టిలో ఉంచుకొని బాబా నన్ను అనుగ్రహించండి. 55. ఓ సద్గురు సాయినాథా ! మీరే మా కల్పతరువు. భవసాగరాన్ని తరింపచేసే నౌక నిశ్చయంగా మీరే. 56. మీరు కామధేనువు. చింతామణి. మీరు జ్ఞానాకాశంలోని భాస్కరులు. సద్గుణాలగని. స్వర్గానికి సోపానం. 57. ఓ పరమపావన పుణ్యమూర్తీ! శాంతస్వరూపా! ఆనందఘనా! ఓ చిత్స్వరూపా ! పరిపూర్ణా! ఓ భేదరహితా ! జ్ఞానసింధూ! 58. ఓ విజ్ఞానమూర్తీ! పురుషోత్తమా! క్షమాశాంతులకు నిలయమా! ఓ భక్తజనుల విశ్రామధామమా ! నన్ను అనుగ్రహించండి. 59. మీరు సద్గురు మచ్ఛిందరు. మీరే మహాత్ములైన జలంధర్, మీరు నివృత్తినాథ్ జ్ఞానేశ్వరులు. కబీరు, షేక్ మహమ్మద్, ఏకనాథులు కూడా మీరే. 60. మీరే బోధ్‌లా, సావతమాలి, సమర్థ రామదాసూ మీరే! సాయినాథా! మీరే తుకారాం. మీరే సఖారాం, మాణిక్యప్రభు.

61. ఈ మీ అవతారాల లక్ష్యం అనూహ్యం. మీరు మీ జాతిని గూర్చి ఎవరికీ తెలియపరచలేదు. 62. మీరు బ్రాహ్మణులని కొందరు యవనులని కొందరు అంటారు. మీరు శ్రీకృష్ణునివలె లీలలను ప్రదర్శించారు. 63. శ్రీకృష్ణుని ప్రజలు పలురకాలుగా అన్నారు. కొందరు యదుకుల భూషణుడని అన్నారు. కొందరు పశువులకాపరి అని అన్నారు. 64. సుకుమార బాలుడని యశోద అన్నది. మహాకాలుడని కంసుడన్నాడు. ప్రేమమయుడని ఉద్ధవుడంటే, జ్ఞానశ్రేష్ఠుడని అర్జునుడన్నాడు. 65. ఈ విధంగా గురుదేవా! ప్రజలు మిమ్మల్ని వారి వారి మనసులకు తోచినట్లు యోగ్యంగా భావిస్తారు. 66. మీ నివాసస్థానం మశీదు. మీ చెవులు కుట్టి ఉండేవి కావు. మీరు పాటించిన మహ్మదీయుల నైవేద్యపద్ధతులను చూచి ప్రజలు మిమ్మల్ని ముసల్మాను అని తలచారు. 67. కాని దయాఘనా ! మీ అగ్ని ఆరాధనను గని మీరు హిందువని మా మనసులకు నిశ్చయమైంది. 68. మీ వ్యవహారిక భేదాలలో తార్కికులు తర్జన భర్జనలు చేస్తారు. కాని జిజ్ఞాసులు, భక్తులు వీటిని పట్టించుకోరు. 69. మీది పరబ్రహ్మస్థితి. జాతిమతాలు మీకు వర్తించవు. మీరు అందరికీ గురుమూర్తి. మీరు ఆది కారణులు. 70. హిందూ ముసల్మానులలో



వైరభావం ఉన్నది. వారిలో ఐక్యతను కలిగించటానికి, భక్తులకు మీ లీలలను చూపించటానికి మీరు మశీదులో అగ్ని ఆరాధనను చేపట్టారు. 71. మీరు జాతిమతాలకు అతీతమైన సాక్షాత్తు సద్వస్తువు. పరబ్రహ్మ. అందువలన మీరు తర్కానికి అంతుచిక్కరు. 72. తర్కవితర్కాల గుబ్బపుస్వారీ మీ వద్ద నిలువజాలదు. అటువంటప్పుడు నా మాటలు నిలువగలవా? 73. అయినా మిమ్మల్ని చూచి నేను మౌనంగా ఉండలేను. కారణం వ్యవహారంలో స్తుతించటానికి సాహిత్యంలోని మాటలే సాధనాలు. 74. అందువలన మీ అనుగ్రహంతో ఎల్లప్పుడూ మాటలతో సాధ్యమైనంతవరకూ వర్ణిస్తుంటాను. 75.

సత్పురుషుల ఘనత గొప్పది.దేవతల కంటె కూడాఅధికం. ఎందుకంటే సత్పురుషుల వద్ద 'నా', 'నీ' అన్న భేద భావాలుండవు. 76. హిరణ్యకశిపుడు, రావణుడు దేవుని ద్వేషించుటవలన వధింపబడ్డారు. ఆ విధంగా సత్పురుషుల చేతిలో వధింపబడిన వారు ఒక్కరైనా లేరు. 77. గోపీచందు జలంధరుని పెంటకుప్పలో పాతిపెట్టినప్పుడు ఆ మహాత్మునికి దుఃఖం కలగలేదు. 78. సరికదా, పై పెచ్చు, ఆ రాజును ఉద్ధరించి చిరంజీవిగా మార్చాడు. ఇటువంటి సత్పురుషుల మహిమలను ఎంతని

వర్ణించగలను? 79. సత్పురుషులు సూర్యనారాయణుని వంటివారు. వారి కృప జ్ఞానప్రకాశం. వారు చల్లటి సుఖాన్నిచ్చే చంద్రుని వంటివారు. వారి కరుణ వెన్నెల వెలుగు. 80. సత్పురుషులు కస్తూరి వంటివారు. వారి కృప పరిమళం వంటిది. సత్పురుషులు చెఱకు రసం వంటివారు. వారి కృపమధురం. 81. సత్పురుషులు దుష్టులపట్ల, శిష్టులపట్ల సమాన దృష్టిని కలిగి ఉంటారు. అంతే కాదు. పాపులపట్ల వారికి ప్రీతి ఎక్కువ. 82. గోదావరి జలంలో శుభ్రపరచటానికి మలిన వస్త్రాలే వస్తాయి. శుభ్రమైన బట్టలు గోదావరికి దూరంగా పెట్టెలోనే ఉంటాయి. 83. పెట్టెలోని బట్టలు కూడా ఒకప్పుడు శుభ్రపరచటానికి గోదావరికి వచ్చినవే. 84. ఇక్కడ ఆ పెట్టె వైకుంఠం. మీరు గోదావరి. శ్రద్ధ స్నానఘట్టం. జీవాత్మలే వస్త్రాలు. వాని మాలిన్యం షడ్వికారాలు. 85. మీ పాద దర్శనమే గోదావరి స్నానం. మీరు మా సకల మాలిన్యాలను తొలగించి నిర్మలంగా చేయగలసమర్థులు. 86. మేము ఈ ప్రపంచంలో మాటిమాటికి మలినులమై పోతున్నాం. అందువలన సత్పురుషుల సందర్శనం అవసరం. 87. గోదావరిలో నీరు పుష్కలంగా ఉండి, ఆ నీటిలో శుభ్రపరచటానికి తెచ్చిన మలిన వస్త్రాలు, శుభ్రం కాకుండా



అక్కడి స్నానఘట్టాలపై ఉండిపోతే అది గోదావరికి అప్రతిష్ఠ కదా ! 88. మీరు చల్లటి నీడనిచ్చే వృక్షం. మేము తాపత్రయాలనే తీవ్ర ఎండబాధకు మాడిపోతున్న బాటసారులం. 89. ఓ గురువర్యా ! కరుణామయా ! మమ్ము ఈ తాపత్రాయల నుండి రక్షించండి. చల్లటి నీడ వంటి మీ కృప లోకోత్తరమైనది. 90. నీడకోసం ఒక వృక్షం క్రింద కూర్చున్నప్పుడు పై నుండి ఎండ వేడి తగులుతుంటే ఆ వృక్షాన్ని నీడను ఇచ్చే చెట్టు అని ఎవరు అంటారు? 91. మీ కృప లేకుండా ప్రపంచంలో బాగుపడటం జరగదు. ధర్మస్థాపన కొరకు అర్జునునికి శ్రీకృష్ణుడు సఖునిగా లభించాడు. 92. సుగ్రీవుని కృపతో విభీషణునికి శ్రీరామప్రభువు లభించాడు. సత్పురుషుల వలననే భగవంతునికి ఘనత. 93. వేదశాస్త్రాలు వర్ణించలేని నిరాకారనిర్గుణపరబ్రహ్మను సగుణసాకార రూపంలో భూమిపైకి అవతరింపచేసినది సత్పురుషులే 94. రుక్మిణీ వల్లభుడైన వైకుంఠపతియగు శ్రీ కృష్ణుని దామాజి మాలవానిగా చేశాడు. చోఖాబా జగన్నాథునితో పశువుల శవాలను మోయించాడు. 95. సత్పురుషుల మహిమలను ఎరిగి శ్రీహరి సక్కుబాయి ఇంట నీళ్ళు మోసాడు. నిజంగా సత్పురుషులు సచ్చిదానంద పరమాత్మను శాసించగలరు. 96.

ఇంకా అధికంగా చెప్పవలసిన అవసరం లేదు. ఓ సద్గురు సాయినాథా ! శిరిడీ గ్రామ నివాసీ ! మీరే మా తల్లి తండ్రి. 97. బాబా ! మీ లీలలు నిజంగా ఎవరికీ అంతుపట్టవు. అటువంటప్పుడు పామరుణ్ణైన నా వాక్కుకు మీ లీలలను వర్ణించ సాధ్యమా? 98. జడుల వంటి జీవులను ఉద్ధరించటానికి మీరు శిరిడీ వచ్చారు. ప్రమిదలలో నీరుపోసి దీపాలను వెలిగించారు. 99. మూరెడు వెడల్పుగల చెక్కపలకను మంచంలా, పైన చూరుకు వ్రేలాడగట్టి, దానిపై శయనించి భక్తులకు మీ యోగ శక్తి సామర్థ్యాన్ని తెలియజేశారు. 100. మీరు అనేకులకు సంతానాన్ని అనుగ్రహించారు. విభూతిని ప్రసాదించి అనేకుల రోగాలను పోగొట్టారు. 101. ఐహిక కష్టాలను తొలగించటం మీకు అశక్యంకాదు. గజరాజుకు చీమ బరువా? 102. గురుదేవా ! దీనులను కరుణించండి. మీ చరణాలకు శరణు జొచ్చిన నన్ను వెనుకకు నెట్టివేయకండి. 103. మీరు మహరాజులకు మహరాజు. కుబేరులకు కుబేరుడవు. వైద్యులకు వైద్యుడవు. నిశ్చయంగా మీ కంటే శ్రేష్ఠులెవరూ లేరు. 104.



ఇతర దేవతల పూజకు విశేషమైన పూజాసామాగ్రి, ప్రత్యేక పూజావిధానం అవసరం. కాని మీ పూజకు జగత్తులో విశిష్టమైన వస్తువేదీ లేదు. 105. సూర్యుని ఇంటిలో దీపావళి పండుగ వచ్చినట్లైతే, ఏ ద్రవ్యాలతో ఆ పండుగను జరుపుకుంటారు? 106. సాగరం యొక్క దప్పికను తీర్చటానికి ఈ భూమిపై నీరు లేదు. అగ్నిని రగల్చటానికి నిప్పు ఎక్కడి నుండి తేవాలి? 107. గురుదేవా శ్రీసాయి సమర్థా ! పూజ చేసే వస్తువులన్నీ ఆది నుండి మీ ఆత్మ యొక్కఅంశాలు, 108. ఈ మాటలన్నీ తత్వదృష్టితో ఊరికే చెప్పటమేగాని పరమాత్మతత్త్వం ఇంకా పట్టుపడలేదు. అందువల్ల అనుభవజ్ఞానం లేకుండా చెప్పేమాటలు నిరర్థకం109. మీ పూజను వ్యావహారికంగా చేయటానికైనా నాకు సామర్థ్యం లేదు. 110. అందువలన గురుదేవా ! అనేక కల్పనలతో మీ పూజ చేస్తాను. దయామయా! ఈ దాసుని యొక్క ఆ పూజనే స్వీకరించండి. 111. ఇక ప్రేమాశ్రువులతో మీ చరణాలను ప్రక్షాళనం చేస్తాను. సద్భక్తియనే చందనాన్ని అరగతీసి రాస్తాను. 112. శబ్దాలంకారాలతో కఫనీని సమర్పిస్తాను. ప్రేమ భావాల సుమమాలను మీ కంఠానికి అలంకరిస్తాను. 113. నా దుర్గుణాలను ధూపంగా దహింపచేస్తాను. అవి చెడు ద్రవ్యాలే అయినా వానినుండి చెడు వాసనలు రావటం లేదు. 114. ధూప ద్రవ్యాలను, సద్గురువు వద్ద

కాక ఇతరత్రా ఎక్కడ కాల్చినా ఆ ధూపద్రవ్యాల నుండి వెలువడే వాసనలు అలాగే ఉంటాయి. 115. ధూప ద్రవ్యాలు అగ్నిని తాకగానే తక్షణం వాని సువాసనలు వెలువడతాయి116. మీ వద్ద వ్యతిరేకంగా జరుగుతుంది. మాలిన్యాలు అగ్నిలో కాలిపోయి సద్గుణాల పరిమళం, ప్రపంచానికి తెలిసేలా మిగిలి ఉంటుంది. 117. గంగా జలంలోని మురికి పోగానే నీరు నిర్మలమవటం సహజం. మనసులోని మాలిన్యంపోయి మనసు నిర్మలమౌతుంది. 118. గురుదేవా ! నేను మాయామోహాలనే దీపాలను వెలిగిస్తాను. దాని వలన వైరాగ్య ప్రభలను లాభంగా పొందేలా అనుగ్రహించండి. 119. మీరు ఆసీనులవటానికి శుద్ధమైన శ్రద్ధ అనే సింహాసనాన్ని అర్పిస్తాను. దానిపై విరాజమానులై భక్తి నైవేద్యాన్ని స్వీకరించండి. 120 ఈ భక్తినైవేద్యాన్ని మీరు సేవించి భక్తిరసాన్ని నాకు ఇవ్వండి. ఎందుకంటే నేను మీ బిడ్డను. కనుక మీ బోధామృతరసాన్ని పానం చేసే అధికారం నాకు ఉన్నది. 121. నా మనసును మీకు దక్షిణగా సమర్పించుకుంటున్నాను. దానివల్ల నాకు ఎటువంటి కర్తృత్వభావం ఉండదు. 122. ఇక ప్రార్థనా పూర్వకంగా సాష్టాంగదండ ప్రణామాలను చేస్తాను. మీరు వానిని స్వీకరించండి. 123.



## ప్రార్థనాష్టకం

శాంతచిత్తా ! మహాప్రజ్ఞా ! సాయినాథా ! దయాఘనా ! దయాసింధూ ! సత్స్వరూపా ! మాయాతమ వినాశకా ! 124. (1) జాతిమత గోత్రాతీతా ! సిద్ధా ! అచింత్యా ! కరుణాలయా ! పాహిమాం పాహిమాం సాయినాథా ! శిరిడీగ్రామ నివాసీ! 125. (2). శ్రీ జ్ఞానభాస్కరా ! జ్ఞానదాతా ! సర్వమంగళకారకా ! భక్తచిత్తమరాళా ! ఓశరణాగతరక్షకా! 126. (3). మీరు సృష్టికర్త బ్రహ్మ. మీరు పాలనకర్త విష్ణుమూర్తి. త్రిలోకాలను లయంచేసే మహేశ్వరులూ మీరే. 127. (4). ఈ పృథ్వీతల మందు మీరులేనిచోటంటూ ఉందా? సాయినాథా ! మీరు సర్వజ్ఞులు, సర్వహృదయాలలోనూ ఉన్నారు. 128. (5). మా సర్వాపరాధాలను క్షమించండి. ఇదే మా ప్రార్థన. భక్తిలోపం వల్ల కలిగే సంశయాలను శీఘ్రంగా తొలగించండి. 129. (6). మీరు ఆవు. నేను లేగదూడను. మీరు చంద్రుడు. నేను చంద్రకాంతమణిని. గంగానదీరూపమైన మీ పాదాలకు ఈ దాసుడు సాదరంగా నమస్కరిస్తున్నాడు. 130. (7). నా శిరస్సుపై మీ కృపాహస్తాన్ని ఉంచండి. మీ దాసుడైన ఈ గణుని చింతలను దుఃఖాలను నివారించండి. 131. (8).

132. ఈ ప్రార్థనాష్టకంతో మీకు సాష్టాంగనమస్కారం చేస్తున్నాను. మా పాపతాపదైన్యాలను త్వరగా నివారించండి. 133. మీరు ఆవు నేను దూడను మీరు మా తల్లి. నేను మీ బిడ్డను. నావిషయంలో మీ మనసున కాఠిన్యతను వహించకండి. మీరు మలయగిరి చందనం. నేను ముళ్లపొదను. మీరు పవిత్ర గోదావరి నీరు. నేను మహాపాతకుణ్ణి. 134. మీ దర్శనమయ్యాక కూడా నామనోమాలిన్యాలు తొలగిపోక ఇంకా ఉంటే మిమ్మల్ని చందనమని ఎవరంటారు ?135. కస్తూర్తి సాంగత్యంలో మట్టికి విలువ వస్తుంది. పూవుల సహవాసంతో ఉన్న దారం శిరస్సుపై ఉంటుంది. 136. అదే విధంగా మహాత్ములు చేపట్టిన వస్తువులు విశిష్టతను సంతరించుకుంటాయి. 137. పరమేశ్వరుడు తన కోసం విభూతిని, మృగచర్మాన్ని, నందిని స్వీకరించాడు. ఆకారణంగానే వాటికి అంతటా గౌరవం లభిస్తుంది. 138. శ్రీ కృష్ణుడు గోపాలురను రంజింప చేయటానికి, బృందావనంలో యమునా తీరాన ఉట్లుకొట్టే ఆటలాడాడు. దానిని కూడా బుధులు గౌరవించారు. 139. నేను దురాచారిని. అయినా మీ శరణు జొచ్చాను. అందువలన ఓ గురుదేవా ! నా గురించి ఆలోచించండి. 140. ఐహిక లేక పారమార్థిక



వస్తువులు ఏవేవి నా మనసుకు నిస్సంశయంగా సుఖమనిపిస్తాయో వానిని ప్రసాదించండి గురుదేవా ! 141. నా మనసును నిగ్రహించుకునేలా మీరు అనుగ్రహించండి. సముద్రపు నీరు తీయగా మారితే ఆ ఉప్పునీటిని గూర్చి భీతిచెందనవసరం లేదు కదా! 142. సాగరాన్ని మధురంగా మార్చగల సామర్థ్యం మీ కున్నది. అందువలన దాసగణుని ఈ కోరికను మన్నించండి. 143. నాలో ఉన్న లోపాలన్నీ మీవే. మీరు సిద్ధులకు రాజు. మీకు ఉపేక్ష శోభించదు. 144. ఇంకా అధికంగా ఏం మాట్లాడను. మీరే మాకు ఆధారం. తల్లిఒడిలో ఉన్న బిడ్డకు నిర్భయం సహజం కదా ! 145. సరే. ఈ స్తోత్రాన్ని ఎవరైతే భక్తిగా పఠిస్తారో వారి కోరికలను మీరే తీర్చాలి. మహాప్రభూ ! 146.

ఈ స్తోత్రానికి మీ ఆశీర్వచనం ఎల్లప్పుడూ ఉండాలి. ఒక సంవత్సరంలో పాఠకుల త్రితాపాలు తొలగిపోవాలి. 147. శుచిర్భూతులై తమ మనసులలో శుద్ధమైన భక్తిభావంతో నిత్యం ఈ స్తోత్రాన్ని పఠించాలి. 148. ఇది వీలుపడకపోతే ప్రతి గురువారమైనా సద్గురు మూర్తిని మనసున ధ్యానించిపఠించాలి. 149. ఇది కూడా వీలుకాకపోతే ప్రతి ఏకాదశి రోజున ఈ స్తోత్రాన్ని పఠించి, దీని ప్రభావాన్ని గ్రహించండి.

150. శ్రోతలారా ! ఈ స్తోత్రాన్ని పఠించే వారి ఐహికమైన కోరికలను గురుదేవులు వెంటనే తీర్చి, చివరగా వారికి ఉత్తమ గతిని ప్రసాదిస్తారు. 151. ఈ స్తోత్రపారాయణతో మందబుద్ధులు బుద్ధిమంతులౌతారు. అల్పాయుష్యులు శతాయుష్యులౌతారు. 152. ఈ స్తోత్రాన్ని పఠిస్తే ధనహీనుల ఇంటికి కుబేరుడు వచ్చి నివశిస్తాడు. ఇది ముమ్మాటికీ సత్యం. 153. ఈ స్తోత్రాన్ని పఠిస్తే సంతానహీనులకు సంతానం కల్గుతుంది. మరియు సకల రోగాలు నలుదిశలా పారిపోతాయి. 154. నిత్యం ఈ స్తోత్రాన్ని పారాయణ చేస్తే చింతలూ, భయాలు తొలగిపోయి గౌరవమర్యాదలు పెరుగుతాయి. అవినాశియైన పరబ్రహ్మను తెలుసుకుంటారు. 155. కనుక బుద్ధిమంతులారా! మీ మనసులలో ఈ స్తోత్రమందు విశ్వాసముంచండి. తర్కవితర్కాలనే చెడు ఆలోచనలకు అసలు చోటివ్వకండి. 156. శిరిడీ క్షేత్ర యాత్రను చేయండి. మనసును బాబా పాదాలయందు లగ్నం చేయండి. భక్తకామకల్పద్రుమమైన సాయి అనాథులకు ఆశ్రయం. 157. వారి ప్రేరణ వలననే నేనీ స్తోత్రాన్ని రచించాను. లేకపోతే పామరుణ్ణైన నాకు ఇటువంటి రచన ఎలా సాధ్యం? 158. శక సం. 1840 భాద్రపద శుక్లపక్షంలో వినాయక చవితి సోమవారం రోజు




(9.9.1918) సూర్యోదయమయాక, 159. మహేశ్వర్‌వద్ద, పవిత్ర నర్మాదానదీతీరాన శ్రీ అహల్యాదేవి సమాధి సన్నిధి వద్ద శ్రీసాయినాథ స్తవనమంజరి సమాప్తి అయింది. 160. మహేశ్వరక్షేత్రమందు సంపూర్ణమైన ఈ స్తోత్రంలోని ప్రతి పదాన్ని శ్రీ సాయినాథులు నా మనసులో ప్రవేశించి పలికించారు. 161. శిష్యుడు దామోదరుడు వ్రాసిపెట్టాడు. దాసగణుడైన నేను సాధుసత్పురుషుల కందరుకూ కింకరుణ్ణి 162. స్వస్తి. శ్రీసాయినాథస్తవనమంజరి భవసాగర తారకం కావాలి. పాండురంగా! దీనినే దాసగణు అత్యాదరంగా విన్నవించుకుంటున్నాడు. 163.

శ్రీహరిహరార్పణమస్తు. శుభం భవతు. పుండరీక వరదా ! హరివిఠల్.
సీతాకాంత స్మరణ జయ జయ రామ. పార్వతీపతీ హరహరమహాదేవ.
శ్రీ సద్గురు సాయినాథ మహారాజ్‌కీ జై.
శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.

# శ్రీసాయినాథ సుప్రసన్న

గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర
గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః
శ్రీమత్ పరబ్రహ్మ గురుస్మరామి
శ్రీమత్ పరబ్రహ్మ గురుం నమామి
శ్రీమత్ పరబ్రహ్మ గురుం యజామి
శ్రీమత్ పరబ్రహ్మ గురుం భజామి
బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం
తత్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలమచలం
సర్వధీసాక్షి భూతం
భావాతీతం త్రిగుణరహితం
సద్గురుంతం నమామి
నిత్యశుద్ధం నిరాభాసం
నిరాకారం నిరంజనం
నిత్యబోధం చిదానందం
సద్గురుం తం నమామ్యహం.



ఓం నమో గురుభ్యో గురుపాదుకాభ్యో. ఓం నమః పరేభ్య పరపాదుకాభ్యోః !!
ఆచార్య సిద్ధేశ్వర పాదుకాభ్యో, నమోనమః శ్రీ గురుపాదుకాభ్యః !!
కామాది సర్పవ్రజగారుడాభ్యాం, వివేక వైరాగ్యనిధి ప్రదాభ్యాం !!
బోధ ప్రదాభ్యాం ధృతమోక్షదాభ్యాం, నమోనమః శ్రీ గురుపాదుకాభ్యాం !!
అనంత సంసార సముద్రతార, నౌకాయితాభ్యాం స్థిరభక్తిదాభ్యాం !!
జాడ్యాబ్ధి సంశోషణవాడవాభ్యాం, నమో నమః శ్రీ గురుపాదుకాభ్యాం !!

## శ్రీసాయిదర్శన్‌మాసపత్రికకు సభ్యులుగా చేరండి !

శ్రీసాయిదర్శన్ ప్రతినెల సం॥రం పాటు ఆహ్వానించుటకు మరియు ఉచితముగా భగవద్గీత (శ్లోకతాత్పర్యముతో), శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రము, శ్రీలలితాసహస్రనామస్తోత్రము, స్తోత్రకదంబమ్ మరియు పాకెట్ కాలెండరు, ఊది పొందగలరు.

సాలు చందా రూ.100/- 3 సం॥లకు రూ.275/-, జీవితసభ్యత్వము (20 సం॥లు) రూ.751/-, మహారాజపోషకులు రూ.1501/-

మనియార్డరు లేదా డిడి ద్వారా పంపండి.

**SRI SAI DARSHAN**
Dammaiguda, Hyderabad - 500 083.
Phone : 040-6564 0220
Cell : 98667 48099